క్లుప్తంగా

రహదారి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



రహదారి పనులపై ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మెళియాపుట్టి: రహదారి పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని గోకర్ణపురం సచివాలయాన్ని పరిశీలించారు. అనంతరం చిన్న హంస గ్రామంలో పల్లె పండగ రహదారి నాణ్యతను పరిశీలించారు. రహదారి నిర్మాణంపై ఇంజినీరింగ్ సహాకుయడిని ప్రశ్నించారు. గోకర్ణపురం గ్రామ సచివాలయాలన్ని సందర్శించి స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో అధికారులను ప్రశ్నించారు. కార్యదర్శి సంతలక్ష్మీపురం పంచాయతీ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా, తహసీల్దార్ పాపారావు, అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ ఆర్డీ రవీంద్ర

ఆమదాలవలస: ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని పురపాలక సంఘ ఆర్డీ వి.రవీంద్ర అన్నారు. శనివారం పట్టణంలోని పర్యటించారు. అన్న క్యాంటీన్‌ను సందర్శించి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్‌తో కలిసి భోజనం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆవరణలో శనివారం మొక్కలను నాటారు. పురపాలక సంఘ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఖాళీ స్థలాలపై పన్నులు ఎందుకు వేయలేదని సిబ్బందిని ప్రశ్నించారు. పన్నుల వసూలులో కూడా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌ను ఆదేశించారు. సిబ్బంది పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు రికార్డులు పరిశీలించి నిర్వహణ సక్రమంగా లేదని, వాటిని సరిచేసుకోవాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ సిబ్బంది, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు నాణ్యతగా చేపట్టాలి



బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న కూన రవికుమార్

ఆమదాలవలస: మండలంలో మంజూరైన ఉపాధి హామీ పనుల్లో నాణ్యత పాటించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తమ్మినేని భారతమ్మ అధ్యక్షతన జరిగిన బడ్జెట్‌ను కొర్లకోట ఎంపీటీసీ సభ్యుడు అన్నెపు భాస్కరరావు ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీడీఓ వెంకటరావు, సూపరింటెండెంట్ వాసుదేవరావు, ఈఓపీఆర్డీ గోపాల్ రావు, జెడ్పీటీసీ సభ్యుడు బెండి గోవిందరావు, ఎంపీటీసీలు బొడ్డేపల్లి సుగుణ, కూటికుప్పల ఉషారాణి, పొన్నాడ అనసూయమ్మ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, తమ్మినేని శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులు



పాతపట్నం: రక్తదానం శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే గోవిందరావు

నరసన్నపేట/ఆమదాలవలస/పాతపట్నం: మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. నరసన్నపేట పట్టణంలోని ఆదివరంపేటలో గల ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఆమదాలవలస పట్టణంలోని పారిశ్రామిక వాడ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కూన రవికుమార్ నివాళులర్పించారు. కృవిజ్ఞాన కేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు నివాళులర్పించారు. లెజెండరీ బ్లడ్ డోనేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మండలంలోని లాబర గ్రామంలో ఇటీవల నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విజేతలకు ట్రోఫీ, రూ.40 వేల నగదు బహుమతిని ఎమ్మెల్యే అందజేశారు.

వ్యవసాయానికి..
ఉపాధి అనుసంధానమయ్యేనా!



దేశవానిపేట వద్ద చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

- 2014లోనే అనుసంధానం చేస్తామన్న టీడీపీ
- పెరిగిన ఖర్చులు.. కూలీల దొరక్క రైతుల అవస్థలు
- నేతలు దృష్టి పెట్టాలంటున్న రైతులు



సత్యవరం వద్ద ఊబాలు వేస్తున్న మహిళలు

నరసన్నపేట: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నాయే తప్ప.. అమలు చేయడం లేదు. కూలీలు ఎక్కువగా ఉపాధి హామీ పనులకు వెళ్తుండటంతో వ్యవసాయ పనులకు కొరత ఏర్పడుతుంది. కూలీ రేట్లు పెరగడంతో పాటు వ్యవసాయ పనులు సకాలంలో పూర్తికాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. యంత్ర పరికరాలు ఎన్ని అందుబాటులోకి వచ్చినా కూలీల కొరతతో అవస్థలు పడుతున్నారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులపై ఖర్చు భారం కూడా తగ్గుతుంది. దీనిపై ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అనుసంధానం చాలా అవసరం..

ఉపాధి పనులు వ్యవసాయానికి అనుసంధానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే ఉద్యావన పంటలకు ఉపాధి హామీ పథకం అనుసంధానం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసే ఇళ్ల నిర్మాణ పనుల్లో భాగంగా కొన్ని పనులకు మస్తర్లు వేసి కూలీ డబ్బులు ఇంటి యజమానికి చెల్లిస్తున్నారు. ఈ విధంగా వ్యవసాయరంగానికి పూర్తిగా అనుసంధానం చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉపాధి పనుల సీజన్‌లో వ్యవసాయానికి కూలీలు దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారు. చాలామంది వ్యవసాయ పనులు వాయిదా వేసుకుంటున్నారు. ఈ దశలో వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని పలువురు రైతులు కోరుతున్నారు.

ఇచ్చిన హామీని నెరవేర్చాలి..

2014లోనే టీడీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని హామీ ఇచ్చింది. అప్పట్లో కాలక్షేపం చేసింది. మళ్లీ కూటమి నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ మిత్ర పార్టీలకు ఒప్పించి అప్పట్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. కేంద్రంలో కూడా జత కట్టడంతో హామీ అమలు చేయడం ఏమంత కష్టం కాదని రైతులు భావిస్తున్నారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని నరసన్నపేట నియోజకవర్గంలోని రైతులు కోరుతున్నారు.

కూలీల కొరతకు చెక్..

నరసన్నపేట నియోజకవర్గంలో ఖరీఫ్, రబీల్లో వరి, అపరాలు, నువ్వు, సన్‌ఫ్లవర్, రాగి, చెరకు, వేరుశనగ, మొక్కజొన్నతోపాటు పలురకాల పంటలు సాగు చేస్తున్నారు. రైతులు వారి స్తోమతకు మించి పంటలు వేస్తున్నారు. అందులో వచ్చిన ఆదాయంతో జీవనం సాగిద్దామనే ఆశతో అధిక పెట్టుబడులు పెట్టి వ్యవసాయం చేస్తున్నారు. దీంతో తరచూ నష్టాలే చవిచూస్తున్నారు. ఈ దశలో వ్యవసాయానికి ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తే కూలీ ఖర్చులు కలిసి వస్తాయని, పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని రైతులు భావిస్తున్నారు. అన్ని పంటలకు కాకపోయినా కొన్ని పంటలకు అయినా ఉపాధి పథకాన్ని అనుసంధానం చేయాలని కోరుతున్నారు.

కూలీలు దొరకడం లేదు..



ప్రస్తుతం వ్యవసాయ పనులకు కూలీలు దొరక్క ఇబ్బంది పడుతున్నాం. ఉపాధి పనులకే కూలీలు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. సకాలంలో వ్యవసాయ పనులు పూర్తి చేయలేక అవస్థలు పడుతున్నాం. ఫలితంగా నష్టాలను చవిచూస్తున్నాం. అదే వ్యవసాయ పనులకు ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వ్యవసాయం మరింత అభివృద్ధి చెందుతుంది.

– కనపల శేఖరరావు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు, పోతయ్యవలస

రైతుల కష్టాలు గుర్తించాలి



రాను, రానూ వ్యవసాయ పనులు చేయడం కష్టం అవుతుంది. కూలీలు అందుబాటులో ఉండకపోవడంతో రైతులు వ్యవసాయం చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. చాలామంది కౌలుకు ఇచ్చేస్తున్నారు. ఇతర మార్గాలు చూసుకుంటున్నారు. ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వ్యవసాయమూ గిట్టుబాటు అవుతుంది. ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

– పోలాకి నర్సింహమూర్తి, ఉర్లాం సర్పంచ్ (రైతు)

నరసన్నపేట నియోజకవర్గంలో ఉపాధి వేతనదారుల వివరాలు				
మండలం	నరసన్నపేట	జలుమూరు	సారవకోట	పోలాకి
జాబు కార్డులు	12,266	13,868	11,341	15,909
వేతనదారులు	18,677	21,849	18,137	27,129

క్రికెట్ టోర్నీ విజేత సవరమర్రిపాడు



మెళియాపుట్టి: సవరమర్రిపాడు జట్టుకు బహుమతి అందజేస్తున్న బైరిసింగి లక్ష్మీనారాయణ



జలుమూరు: ట్రోఫీతో ఆదివాసీ టీమ్

మెళియాపుట్టి: మండలంలోని వెంకటాపురం గ్రామంలో అల్లూరి సీతారామరాజు క్రికెట్ టోర్నమెంట్ విజేతగా సవరమర్రిపాడు నిలిచింది. మండల గిరిజన నాయకుడు, మాజీ ఎంపీపీ బైరిసింగి లక్ష్మీనారాయణ ఈ నెల 8వ తేదీన క్రికెట్ పోటీలు ప్రారంభించారు. గత పది రోజులుగా నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 37 టీమ్‌లు (గిరిజన యువకులు) పాల్గొన్నాయి. శనివారం సవరమర్రిపాడు, వెంకటాపురం జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. సవరమర్రిపాడు విజయం సాధించింది. విన్నర్స్‌కు రూ.10 వేలు, మెమోంటో, రన్నర్స్‌కు రూ.8 వేల నగదు, మెమొంటోలు అందించారు.

ఆదివాసీ టీమ్ విజయకేతనం..

జలుమూరు: సంక్రాంతి పురస్కరించుకుని మండల పరిధిలోని ఎస్టీ మాకివలసలో శనివారం జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లో ఆదివాసీ టీమ్ విజేతగా నిలిచింది. మొత్తం 25 జట్లు పాల్గొన్నాయి. మాకివలస జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది సిరిస్‌గా ఉదయ్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సింహాచలం నిలిచారు. విజేత జట్టుకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.


బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

జలుమూరు: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాలల సమన్వయకర్త పూడి జనార్దనరావు అన్నారు. శనివారం చల్లవానిపేట జంక్షన్‌లో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. బాల కార్మికులతో పనులు చేయిస్తే చట్టరీత్యా నేరమన్నారు. అటువంటివారు తారసపడితే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం ఎమ్మార్సీ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లా అసిస్టెంట్ లేబర్ అధికారి శైలేష్ కుమార్, చైల్డ్‌లైన్ ప్రతినిధి వైకుంఠరావు, ఎంఈఓలు మాధవరావు, ప్రసాదరావు, సీఆర్పీలు పట్ట వైకుంఠరావు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి పశువైద్య శిబిరాలు

పాతపట్నం: ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు ఎం.కరుణాకరరావు శనివారం తెలిపారు. మండలంలో రోజుకు రెండు శిబిరాలు పశువైద్యుల పర్యవేక్షణలో జరగనున్నట్లు చెప్పారు. పెద్ద పశువులు, దూడలు, గొర్రెలు, మేకలకు డీ వార్మింగ్ మందులు ఇస్తామన్నారు. పాతపట్నం మండలంలో ఈ నెల 20న ఆర్.ఎల్.పురం, పెద్దలోగిడి, 21న రొంపివలస, సింగుపురం, 22న ఎ.ఎస్.కవిటి, గంగువాడ, 23న పాతపట్నం, 24న బడ్డుమర్రి, 25న తెంబూరు, 27న కొరసవాడ, 28న కాగువాడ, 29న బూరగాం, 30న చంగుడి, 31న తిడ్డిమి సచివాలయాల పరిధిలో పశువైద్య శిబిరాలు ఉంటాయన్నారు. మెళియాపుట్టి మండలంలో ఈ నెల 21న మెళియాపుట్టి, భరణికోట, 22న కొసమాల, కరజాడ, 23న వసుందర, చంపాపురం, 24న పెద్దపద్మాపురం, చీపురపల్లి, 25న ఇల్లాయ్‌పురం, గోకర్ణపురం, 27న దీనబంధుపురం, గంగరాజుపురం, సిరియాకండి, 28న శేఖరాపురం, కేరశింగి, 29న రామచంద్రపురం, జన్నిబంద, 30న బాణాపురం, 31న జాడుపల్లి గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష



నరసన్నపేట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ శాంతారావు

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలో నవోదయ ప్రవేశ పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు నారాయణ స్కూల్లో సెంటర్లు నిర్వహించారు. ఈ రెండు కేంద్రాల్లో 587 మంది విద్యార్థులకు కేటాయించగా 503 మంది హాజరయ్యారని ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు తెలిపారు. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నవోదయలో 6వ తరగతిలో ప్రవేశం ఉంటుందన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రాజ్‌శ్రీనివాస్ ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈ రెండు కేంద్రాల్లో 596 విద్యార్థులకు 521 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలకు సీఎస్‌లుగా ఎ.గోవిందరావు, ఆర్.వి.రమణ, సీఎల్‌ఓలుగా మల్లికార్జునరావు వ్యవహరించారు. ఎంఈఓ చందక గోవిందరావు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు.

పాతపట్నంలో..

పాతపట్నం: మండల కేంద్రంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షను 576 మంది విద్యార్థులు రాశారని ఎంఈఓలు ఎ.గోవిందరావు, సి.హెచ్.తిరుమలరావు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 312 మంది విద్యార్థులకు 275 మంది, అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 264 మందికి 234 మంది హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు వైకుంఠరావు, వల్లభరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో త్యాగరాజ ఆరాధనోత్సవాలు



త్యాగరాజ స్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న సంగీత కళాశాల విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక శారద సంగీతాలయంలో శనివారం త్యాగరాజ స్వామి 178వ ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంగీతాలయం నిర్వాహకురాలు పొన్నాన లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7.30 గంటల నుంచి వివిధ కార్యక్రమాలు చేపట్టారు. త్యాగరాజస్వామి విగ్రహాన్ని ఊరేగించారు. సాయంత్రం నిర్వహించిన సంగీత కచేరీ ఆకట్టుకుంది.

స్వచ్ఛాంధ్ర అందరి బాధ్యత



ఎల్.ఎన్.పేట: స్వచ్ఛ ఆంధ్రలో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీనివాసరావు, అధికారులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి నెలా మూడో శనివారం ఈ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించింది. ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో ఆయా పరిధిలోని అధికారులు, సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని అధికారులు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్

అపూర్వ సమ్మేళనం



1999-2,000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, కుటుంబ సభ్యులు

సారవకోట: సారవకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2,000లో 10వ తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థులు శనివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. వారంతా ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

మూలకుచేరాయి..



ఈ చిత్రం హిరమండలం మండల పరిషత్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న స్వచ్ఛ సంకల్ప రిక్షాలు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతోంది. ఇళ్లలో తడి, పొడి చెత్తను తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అందజేసిన రిక్షాలను నిరుపయోగంగా వదిలేయడంతో అవి తుప్పుబట్టి మూలకుచేరాయి. స్వచ్ఛ దివాస్ లక్ష్యం నెరవేరకపోగా ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైంది. ఈ విషయమై ఈఓపీఆర్డీ వద్ద ప్రస్తావించగా త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

– హిరమండలం

నిబంధనలకు పాతర..



ఈ చిత్రం హిరమండలం గొట్టా బ్యారేజీ మీదుగా పరదాలు కప్పకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్. హిరమండలం మండలంలోని వంశధార నదీతీర గ్రామాలైన బగిరథిపురం, పిండ్రువాడ, అంబావల్లి, హిరమండలం, కోరాడ, రెల్లివలస, అక్కరాపల్లి రేవుల నుంచి నిత్యం ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. వాహనాలపై పరదాలు కప్పకుండా ఇసుక తీసుకువెళ్తుండటంతో వెనుక వచ్చే వాహనదారుల కంట్లో ఇసుక రేణువులు పడుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై ఎస్సై ఎండీ యాసిన్ మాట్లాడుతూ.. పరదాలు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

– హిరమండలం

రోడ్డు పక్కనే చెత్త



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని పూశాం నుంచి చొర్లంగి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త. గ్రామస్తులు చెత్తను తీసుకునివచ్చి గ్రామ శివారులో రోడ్డు పక్కన వేస్తున్నారు. రోడ్డుపై వెళ్లలేకపోతున్నామని ద్విచక్ర వాహనదారులు, నడిచి వెళ్లేవారు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించాలని స్థానికులతోపాటు ప్రయాణికులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

తిరుగు ప్రయాణం



ఈ చిత్రం కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శ్రీకాకుళం వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు. సంక్రాంతికి వచ్చిన వారు శనివారం తిరిగి ప్రయాణమయ్యారు. గతంలో కొత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి విశాఖపట్నం, అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడకు ఆర్టీసీ బస్సులు సర్వీసలు ఉండేవి. ప్రస్తుతం దూర ప్రాంతాలకు బస్సులు లేకపోవడంతో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లేందుకు ఆర్డినరీ బస్సులపై ఆధారపడుతున్నారు. ఇవి కూడా తక్కువగా ఉండటంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు.

– కొత్తూరు

మురుగునీటి కాలువలపై
పలకలు

సారవకోట: మండలంలోని శివరాంపురం గ్రామంలో మురుగునీటి కాలువలపై శనివారం పలకలు వేశారు. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని శుక్రవారం సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీఓ మోహన్‌కుమార్ సంబంధిత సచివాలయ సిబ్బందికి సమస్య పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. మురుగునీటి కాలువల్లో పూడికలు తొలగించి అవసరమైన చోట పలకలు వేశారు.



కాలువపై వేసిన పలకలు

డ్రైవర్లకు నేత్ర పరీక్షలు



నరసన్నపేట: డ్రైవర్లకు కంటి తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యురాలు స్ఫూర్తి



కొత్తూరు: ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు జానకిరామయ్య

నరసన్నపేట: చిన్న దృష్టి లోపం ఉన్నా డ్రైవర్లు వాహనాలను సక్రమంగా నడపలేరని, అటువంటప్పుడు ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్ అన్నారు. ఫోర్ వీలర్ లైసెన్స్ ఉన్న ప్రతి ఒక్కరూ విధిగా ఎప్పటికప్పుడు కళ్ల తనిఖీలు చేసుకొని దృష్టి లోపాన్ని సరిచేసుకోవాలని కోరారు. రోడ్డు సేఫ్టీలో భాగంగా శనివారం 15 మంది ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ ఆస్పత్రిలో కళ్ల తనిఖీలు చేయించారు. ప్రభుత్వ ఆస్పత్రి నేత్ర వైద్యురాలు స్ఫూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు..

కొత్తూరు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఆటో డ్రైవర్లకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కొత్తూరు పీహెచ్‌సీ ఆఫ్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకి రామయ్య కంటి పరీక్షలు నిర్వహించారు. కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు, ఎస్ఐ ఎండీ అమీర్ అలీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.